
**ప్రజల మాట ప్రగతి బాట**







అమ్మవారికి జలాభిషేకం కోసం నదుల జలాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న కౌండన్య యూత్ సభ్యులు, గ్రామస్తులు



కొల్చారం: పోతంశెట్‌పల్లిలో దుర్గామాతకు పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ యువత అధ్యక్షుడు సంతోష్‌రావు

# భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు

చిలిపిచెడ్/రామాయంపేట/నిజాంపేట/కొల్చారం/చిన్నశంకరంపేట/పాపన్నపేట/మెదక్ రూరల్, అక్టోబర్ 18: మండలంలోని చిట్కుల్ గ్రామ శివారు మంజీరానది తీరాన వెలిసిన చాముండేశ్వరి ఆలయంలో బుధవారం నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా జరిగాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ఒక్కోరోజు ఒక్కో అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. మంజీరా నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలు, ఒడిబియ్యం పోసి మొక్కలు చెల్లించుకున్నారు. అలయ ఆవరణలో భక్తులు కొత్త వాహనాలకు పూజలు చేయించుకున్నారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమంలో నిర్వహించారు.

☛ రామాయంపేట పట్టణంలోని మహంకాళి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మి దేవిగా పూలతో భక్తులు అలంకరించారు. బుధవారం అమ్మవారి సన్నిధిలో ఆలయ కమిటీ చైర్మన్ దంపతులు పాండురంగాచారి–వరలక్ష్మిలు పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఆలయ సన్నిధిలో అమ్మవారికి మంగళ హారతులు, నైవేద్యాలను సమర్పించి పూజలు చేశారు. పట్టణంలోని దుర్గాదేవి అమ్మవారి వద్ద 12వ వార్డు కౌన్సిలర్ సౌభాగ్య–శ్యాంసుందర్‌చారి దంపతులతోపాటు యువకులు అమ్మవారిని మహాలక్ష్మి దేవతగా అలకరించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాజుయాదవ్, చింతల రాములు, మర్కు దత్తు, ఆలయ పూజారి నాగరాజు చారి, సిబ్బంది పాల్గొన్నారు.


☛ నిజాంపేట మండల వ్యాప్తంగా దుర్గమాత దేవీ శరన్నవరాత్రోత్సవాలు కనుల విందుగా కొనసాగుతున్నాయి. బుధవారం నస్కల్‌లో కౌండన్య యూత్ సభ్యులు ప్రతిష్ఠించిన దుర్గమాత అమ్మవారికి నదుల జలాలతో అభిషేకం నిర్వహించారు. అంతకుముందు యూత్ సభ్యులు, గ్రామస్తులు ఆయా నదుల నుంచి సేకరించిన జలాలు స్థానిక రేణుక ఎలమ్మ ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కౌండన్య యూత్ సభ్యులు ప్రభాకర్‌గౌడ్, నరేందర్‌గౌడ్, వంశీగౌడ్, భాస్కర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



చిలిపిచెడ్: జగ్గంపేటలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న యువకులు



మడూరులో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ప్రత్యేక పూజలో శివశంకర్ గుప్తా కుటుంబ సభ్యులు

☛ కొల్చారం మండల వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు. పలు గ్రామాలలోని ప్రధాన కూడళ్లు, దేవాలయ ఆవరణలో దుర్గామాత ఉత్సవ విగ్రహాలను అందంగా తీర్చిదిద్దిన మండపాలలో ఏర్పాటు చేశారు. ఈమేరకు బుధవారం పోతంశెట్‌పల్లిలో బీఆర్‌ఎస్ యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్‌రావు పూజలు చేశారు. చిన్నాఘన్‌పూర్‌లో దుర్గామాత వద్ద బీఆర్‌ఎస్ నాయకులు సోమ నర్సింహులు, నాగం రమేశ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

☛ చిన్నశంకరంపేటతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారి మండపాల వద్ద అమ్మవారికి ఒడి బియ్యాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారు గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

☛ విజయదశమి నవరాత్రి ఉత్సవాలను పుర్కరించుకుని బుధవారం మెదక్ మండలంలోని మాచవరంలో దుర్గమాత అమ్మవారిని ధనలక్ష్మీ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

☛ పాపన్నపేట మండలంలోని కొడుపాకలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నాలుగవ రోజు అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విగ్రహదాత పాపన్నపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉప్పల శివశంకర్–సంతోషి దంపతులు బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నస్కల్‌లో దళిత రైతులకు బయోఫర్టిలైజర్ ఎరువులను పంపిణీ చేస్తున్న కేవీకే శాస్త్రవేత్త శ్రీకాంత్

## దళిత రైతులకు బయోఫర్టిలైజర్ పంపిణీ

నిజాంపేట, అక్టోబర్18: మండలంలోని నస్కల్‌లో దళిత రైతులకు 'రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం'సభ్యులు ఉచితంగా బయోఫర్టిలైజర్ ఎరువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కృషి విజ్ఞాన కేంద్రం తునికి శాస్త్రవేత్త శ్రీకాంత్ హాజరై మాట్లాడారు. బయోఫర్టిలైజర్ ఎరువులను రైతులు తమ వ్యవసాయ పొలాల్లో వాడటం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. సేంద్రీయ వ్యవసాయం ప్రోత్సహించే లక్ష్యంతో కృషి దివాస్ ప్రణాళికలో భాగంగా దళిత రైతులకు బయోఫర్టిలైజర్ ఎరువులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అధికారి శ్రీనివాస్, రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ లక్ష్మగౌడ్, సీఈవో సురేశ్, రైతులు అశోక్, ఎల్లయ్యా, జలేందర్, బాల్‌రాజు, మైసయ్యా, పోశవ్వా, ఎల్లవ్వా, రాజు తదితరులు ఉన్నారు.



కొల్చారం: కోనాపూర్‌కు వెళ్లే రోడ్డుపై ముళ్లపొదలను డోజర్‌తో తొలిగిస్తున్న గ్రామస్తులు

## రోడ్డుపై ముళ్ల పొదలు తొలిగింపు

కొల్చారం, అక్టోబర్ 18: మండలంలోని కోనాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డుపై అడ్డుగా ఉన్న ముళ్లపొదలను బుధవారం గ్రామస్తుల సాయంతో పంచాయతీ కార్యదర్శి నగేశ్ పర్యవేక్షణలో డోజర్‌తో తొలిగించారు. రంగంపేట నుంచి కోనాపూర్ వెళ్లే రోడ్డుకు ముళ్లపొదలు అడ్డుగా పెరగడంతో రాత్రిపూట ప్రమాదాలు జరుగుతున్నాయి. బతుకమ్మ, దసరా పండుగలకు ఇతర ప్రాంతాల నుంచి వాహనాల్లో సొంత గ్రామానికి రానున్నారు. రోడ్డుకు అడ్డుగా ముళ్లపొదలు, చెట్లు రావడంతో రోడ్డు కన్పించకుండా ఇరుకుగా మారింది. దీంతో బీఆర్‌ఎస్ మండల యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్‌రావు, మాజీ సర్పంచ్, రంగంపేట సొసైటీ వైస్ చైర్మన్ మోత్కు మల్లేశం సహాయంతో పంచాయతీ కార్యదర్శి నగేశ్ డోజర్ సాయంతో రోడ్డుకు అడ్డుగా ఉన్న పొదలను తొలిగించారు.

## మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

నిజాంపేట, అక్టోబర్ 18: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో అక్రమ మద్యం తరలించడం, బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నిజాంపేట ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని తిప్పనగుల్లకి చెందిన బెల్ట్ షాప్ నిర్వాహకుడు శ్రీనివాస్‌గౌడ్ అక్రమంగా మద్యం (12 బీర్ బాటిళ్లు, 23 క్వాటర్లు) తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు.

## రేపు మండల సర్వసభ్య సమావేశం

చిన్నశంకరంపేట, అక్టోబర్ 18: చిన్నశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 20న ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మండల సర్వసభ్య సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్‌లు సంబంధిత శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

వెల్దుర్తి, అక్టోబర్ 18: ఇటీవలే గ్యాస్ సిలిండర్ లీకేజీ కావడంతో తీవ్ర గాయాలై గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఉప్పులింగాపూర్‌కి చెందిన వడ్ల వీరమణి అంత్యక్రియలు బుధవారం స్వగ్రామంలో జరిగాయి. వీరమణి మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి వీరమణి అంత్యక్రియలో పాల్గొని కుటుంబసభ్యులను ఓదార్చారు. వీరమణి మృతి బాధాకరమని, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, వారిని అన్నివిధాల ఆదుకుంటామన్నారు. దామరంచకి బీఆర్‌ఎస్ నాయకులు నర్సారెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే నర్సారెడ్డి, మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి పరామర్శించారు.

## ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించాలి

కొల్చారం, అక్టోబర్ 18: ఎన్నికల ప్రవర్తన నిబంధనలు ఉల్లంఘించే వారిపై 'సీ విజిల్' బ్రహ్మాస్త్రమని కొల్చారం తహసీల్దార్ మహ్మద్ గఫార్ మియా అన్నారు. కొల్చారంలోని రైతువేదికలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రవర్తన నియమావళిపై బుధవారం పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు అన్ని గ్రామా ల్లో బూత్‌లెవల్ అవగాహన కమిటీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కమిటీకి పంచాయతీ కార్యదరి కన్వీనర్‌గా, బూత్ లెవల్ ఆఫీసర్, బూత్ లెవల్ ఏజెంట్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రిటైర్డు ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులను కమిటీలో చేర్చుకుని ఏర్పాటు చేయాలన్నారు.ఈ సమావేశంలో ఎంపీడీవో గణేశ్‌రెడ్డి, ఎంపీవో లక్ష్మీనర్సింహులు, గిర్దావర్ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కొల్చారం: ఎన్నికల ప్రవర్తన నియమావళిపై సూచనలిస్తున్న తహసీల్దార్




దామరచెర్వు హైవే వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

## పోలీసుల తనిఖీలో రూ.61,560 పట్టివేత

రామాయంపేట, అక్టోబర్ 18: రామాయంపేట జాతీయ రహదారి దామరచెర్వు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో భాగంగా ఓ కారులో రూ.61,560 లు లభ్యమైనట్లు రామాయంపేట ఎస్సై.రంజిత్ తెలిపారు. బుధవారం రామాయంపేట హైవేపై చెక్ పోస్టుల వద్ద వాహనాలను తనిఖీలు చేస్తుండగా మెదక్‌కు చెందిన కృష్ణయ్యా తన కారులో బిల్లులు లేకుండా రూ.61,560లు దొరికాయని, సరైన పత్రాలు చూపికపోవడంతో ఆ డబ్బులను జిల్లా ఎలక్షన్ మానిటరింగ్ ఎక్స్‌పెండీచర్‌కు డబ్బులను అప్పగించినట్లు ఎస్సై వెల్లడించారు.